క్లుప్తంగా

రాఖీ పండగ సందడి



టేకుమట్ల: రక్షాబంధన్ సందర్భంగా సందడి ఆదివారం నుంచే మొదలైంది. వ్యాపారులు మండల కేంద్రంలో రాఖీ స్టాళ్ల ఏర్పాటు చేయడంతో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, ప్రయాణికులు మండల కేంద్రంలోని రాఖీ స్టాళ్లలో కొనుగోలు చేస్తున్నారు. పలు రకాల రాఖీలతో స్టాళ్లు అందరిని ఆకర్షిస్తున్నాయి. రాఖీలతో పాటు స్వీట్లు సైతం కొనుగోలు చేయడంతో స్వీట్‌హౌజ్‌లకు గిరాకీ లభిస్తుందని నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కంటెయినర్ బోల్తా..



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం సూరారం సమీపంలో మలుపు వద్ద ఛత్తీస్‌గఢ్ లోని బీజాపూర్‌కు టూవీలర్ షోరూమ్‌కు కొత్త టూవీలర్స్ బైక్‌లను తీసుకువెళ్తున్న కంటెయినర్ ఆదివారం తెల్లవారుజామున బోల్తాపడింది. కాగా, డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని మహదేవపూర్ ఆస్పత్రికి తరలించారు.

'టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించాలి'

కాళేశ్వరం: రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించాలని మహదేవపూర్ మాజీ జెడ్పీటీసీ గుడాల అరుణ శ్రీనివాస్ కాంగ్రెస్‌పార్టీ అధిష్టానాన్ని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఆయనను టీపీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తే పార్టీ మరింత బలోపేతానికి కృషిచేస్తారని పేర్కొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



కాటారం: మండలంలో పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనుక్కొని బాధితులకు ఎస్సై మ్యాక అభినవ్ ఆదివారం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని జాదారావుపేటకు చెందిన కట్కు సతీశ్, దామెరకుంటకు చెందిన పెంట రవి ఇటీవల సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించడంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేశారు. మొబైల్స్‌ను పోర్టల్ ద్వారా పోలీసులు గుర్తించి రికవరి చేసి ఎస్సై బాధితులకు అందజేసకారు.

కమిటీ ఎన్నిక



ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆదివారం జిల్లా పార్టీ పూర్తిస్థాయి కమిటీని నియమించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా అడప భిక్షపతి, జినుకల కృష్ణాకర్, ఏనుగు రవీందర్, చెవుగోని స్వప్న, ప్రధాన కార్యదర్శులుగా శ్రీమంతుల రవింద్రాచారి, పూర్ణం నరేష్ నియామించారు. అలాగే అసెంబ్లీ కన్వీనర్‌గా జాడి వెంకట్, కార్యదర్శులుగా తిరుపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, అమర్, శ్రీనివాస రావు, రవీందర్, సురేష్, రఘురాం, మహేందర్, స్పోక్స్ పర్సన్స్‌గా సూర్యదేవర విశ్వనాథ్, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, కోశాధికారిగా గంగిశెట్టి రాజ్‌కుమార్, ఆఫీస్ సెక్రటరిగా దొంతి రెడ్డి రవిరెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు శ్రీనివాస్, సాయిబాబా, కుమార్, శ్రీహరిని నియమించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.

వాహనాల తనిఖీ



వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎదిర గ్రామ శివారుల్లో ఆదివారం పోలీసులు ఎస్సై కొప్పుల తిరుపతి రావు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానిత వ్యక్తుల వివరాలను సేకరించారు. ఈ తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

సర్వాయి పాపన్న జీవితం ఆదర్శం

మొగుళ్లపల్లి: సర్వాయి పాపన్న జీవితం ఆదర్శమని పలు సంఘాల నాయకులు అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను మండల కేంద్రంతో పాటు పెద్దకోమటిపల్లిలో సర్వాయి పాపన్న మోకు దెబ్బ సంఘం, గౌడ సంఘం, జైగౌడ్ ఉద్యమ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సర్వాయి పాపన్న ఫొటోకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా సంఘాల వారు మాట్లాడుతూ.. పాపన్న గౌడ్ బహుజనుల రాజ్యాధికారం కోసం ఎన్నో ఉద్యమాలను చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాల కోసం గౌడ కార్మికులు ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్పించి నేటి తరానికి తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వేముల మహేందర్, శ్రీహరి, వెంకటేష్, రమేష్, స్వామిగౌడ్, అశోక్, శ్రీనివాస్, కిరణ్, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చెర్మన్ ఎండి రఫీ, క్యాతరాజు రమేశ్, నీల రాజు, బండారి కుమార్, మంగళపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేగొండ: సర్వాయి పాపన్న జీవితంను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం మండలంలోని దమ్మన్నపేటలో పాపన్న జయంతి సందర్భంగా గౌడ సంఘం నేతలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొఘల్ చక్రవర్తుల అరాచక పాలనను ఎదిరించిన గొప్ప ధీరుడు పాపన్న అని కొనియాడారు. అనంతరం గ్రామంలోని ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి వెంకటేశ్వర్‌రావు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, జిల్లా నాయకులు నాయిని సంపత్‌రావు, మోడెం ఉమేష్‌గౌడ్, ఐలి శ్రీధర్, నడిపల్లి శ్రీనివాసరావు, పున్నం రవి, ప్రతాప్ రెడ్డి, గౌడ సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.



రేగొండ: పాపన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గౌడ కులస్తుల ఆధ్వర్యంలో..

మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ తల్లి దేవాయంలో గౌడ కులస్తులు పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మోడెం ఉమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. బహుజన సామాజిక వర్గాల కోసం పోరాడిన గొప్ప యోధుడు పాపన్న అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు మాడగాని శంకర్, సుదర్శన్, శంకర్, మల్లేష్, తిరుపతి, శీను, వెంకన్న, లింగమూర్తి, మల్లయ్య, రమేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఆదివారం గౌడ సంఘం, కాంగ్రెస్, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూలమాల వేశారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా నాయకులు తిరుపతి, శ్రీనివాస్, మల్లేష్, లక్ష్మణ్, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేష్, రమేశ్, రవీందర్, సురేష్, గుమ్మడి సత్యం, కొమురయ్య, నరేష్, వల్లాల ప్రవీణ్, ప్రభాకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

టేకుమట్ల: సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో సర్వాయి పాపన్న మోకుదెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం భిక్షపతిగౌడ్ ఆధ్వర్యంలో మండలంలోని పంగిడిపల్లిలో ఘనంగా నిర్వహించారు. బహుజనులంతా ఏకతాటిపై నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేరేళ్ల రామకృష్ణగౌడ్, కోటగిరి సతీష్‌గౌడ్, కొయ్యల చిరంజీవి, కత్తి సంపత్, గునిగంటి మహేందర్, పెసరు రాజేష్, శ్రీనివాస్, బండి శ్రీను, గొల్లపెల్లి సంతోష్, పల్లెర్ల తిరుపతి, బొల్లికొండ రాజయ్య పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి: పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



టేకుమట్లలో..



చిట్యాల: కేక్ కట్ చేస్తున్న గౌడ సంఘం జిల్లా నాయకుడు తిరుపతి

బాబోయ్.. కోతులు

- వీధుల్లోకి వెళ్లేందుకు జంకుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



కుంభపల్లి గ్రామంలో గుంపులుగా తిరుగుతున్న కోతులు

మల్హర్: అడవిలో ఉండాల్సిన వానారాలు గ్రామాల్లో తిరుగుతూ నిత్యం ప్రజలకు నరకాన్ని చూపిస్తున్నాయి. వాటి ఆగడాలకు అంతులేకుండా పోయింది. గ్రామాల్లో రోజు రోజుకు వాటి సంఖ్య పెరుగుతూ గ్రామ జనాభాతో పోటీ పడుతున్నాయి. ఇళ్లలో ఉన్నా, వీధుల్లోకి వెళ్లిన ప్రజలు బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇంట్లో ఉన్నా తప్పనసరిగా తలుపులు మూసి ఉంచాల్సిందే. ఆదమరిస్తే అంతే సంగతులు. ఇళ్లలోకి చేరి అందిన పదార్థాలను ఎత్తుకెళ్లి దర్జాగా తింటున్నాయి. అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే మీద పడి గాయాల పాలు చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపార సముదాయాల్లో కూడా దుకాణాల్లోని వస్తువులు ఎత్తుకెళ్తున్నాయి. రోడ్ల పక్కన, తోపుడు బండ్లపై కూరగాయలు, పండ్లు అమ్ముకునే వ్యాపారులు సైతం వీటి భారిన పడి నష్టపోతున్నారు. చిన్నపిల్లలు, మహిళలు వీధుల గుండా తిరగాలంటేనే భయపడుతున్నారు. అధికారులు దృష్టి సారించి వాటిని సమీప అడవుల్లో వదలి కోతులను నివారణకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



భూపాలపల్లి రూరల్: ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు



చిట్యాల: ఆర్థిక సాయం అందజేస్తున్న బాల్యమిత్రులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామానికి చెందిన తంగళ్లపల్లి రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి గొర్లవీడు గ్రామానికి చెందిన హెల్పింగ్‌హ్యాండ్ టీం సభ్యులు ఆదివారం 25 కిలోల బియ్యంతో పాటు రూ.8500 ఆర్థిక సాయం చేశారు.

చిట్యాల: మండలంలోని జడలపేట శివారు భీష్మనగర్‌కు చెందిన ఆర్ఎంపీగా పని చేసిన బండారి ప్రభాకర్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి మృతుడితో కలిసి పదవ తరగతి చదువుకున్న 1997 బ్యాచ్‌కి చెందిన మిత్రులు రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు రఘుపతి, పసుపుల శ్రీనివాస్, మధుకర్, రమణారెడ్డి, రవీందర్, రాంబాబు, దేవేందర్, దుర్గాప్రసాద్, నక్క రవి, రమేష్‌కుమార్, రవి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కైలాపూర్‌లో..

మండలంలోని కైలాపూర్ గ్రామానికి చెందిన చింతల శైలేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి బాల్య మిత్రులు బాధిత కుటుంబ సభ్యులకు రూ.17వేలు నగదు అందజేశారు. మృతుడి కుమార్తెలు శ్రీజ, శ్రీనిధిలకుపై చదువుల కోసం అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మోత్కూరి శ్రీశైలం, చింతల కృష్ణ, రాజేందర్, ఆకుల సతీష్, గంగాధరి రాజు, గంపల మధుకర్, తుమ్మల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

చిట్యాల: మండలంలోని గోపాలపూర్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని ఎస్సై శ్రావణ్‌కుమార్ కోరారు. ఆదివారం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి వారితో మాట్లాడారు. సీసీ కెమెరాలు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు ఉపయోగపడుతాయని అన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానమని అన్నారు. ఏఎస్సై సమ్మిరెడ్డి, పోలీస్ సిబ్బంది అస్లాం జానీ, గ్రామస్తులు మూల శంకర్‌గౌడ్, ఏకు రవీందర్, తణుకు శ్రీనివాస్, ఏరుకొండ రఘు, రాజేందర్, స్వామి, భాస్కర్, రాజేష్, లక్ష్మీనారాయణ, రాకేశ్ పాల్గొన్నారు.

ఆపదలో ఉంటే 100కు డయల్ చేయాలి

ఏటూరునాగారం: ప్రజలు ఆపదలో ఉంటే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని ఎస్సై తాజొద్దీన్ అన్నారు. ఆదివారం మండలంలోని ముళ్లకట్ట రాంపూర్‌లో రాత్రి గ్రామస్తులతో ఎస్సై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాల నివారణకు పలు సూచనలు చేశారు. మహిళలు ఆపదలో ఉన్నా, లేదా ఆకతాయిలుతో అవస్థలు పడ్డా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో నేరాలు అదుపులోకి రావాలి అంటే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అన్నారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వస్తే ఎలాంటి సాయం, ఆశ్రయం ఇవ్వొద్దన్నారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతం కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.



నేరాలపై వివరిస్తున్న ఎస్సై తాజొద్దీన్

'జైశ్రీరామ్' స్టిక్కర్ల పంపిణీ

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన తాడూరి రఘు, తాడూరి దీనభాంధవస్వామి, గాదె లింగాచారి, కత్తెర శ్రీనివాస్ సహకారంతో వెయ్యి వాహన జై శ్రీరామ్ స్టిక్కర్లను ప్రజలకు ఆదివారం మండల కేంద్రంలోని రామాలయంలో ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని పెద్దలు పెద్ద హాజరై స్టిక్కర్లను వాహనదారులకు అందజేశారు. ప్రతి వాహనదారుడు తన వాహనానికి జైశ్రీరామ్ స్టిక్కర్‌లను అంటించుకొని భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కత్తెర శ్రీనివాస్, గౌరిశంకర్, నూక ప్రభాకర్, కోడి వెంకట్, శ్రీను, ప్రవీణ్, అలువాల శ్రీనివాస్, సూర్యనారాయణ, విగ్నేష్, ఇంద్రకర్, ప్రవీణ్, రాజేష్, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

దినపత్రికలకే పరిమితం

- అరకొర వసతులతో గ్రంథాలయం
- అద్దె భవనమే దిక్కు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

మొగుళ్లపల్లి: పాలకుల పట్టింపులేనితనమో, అధికారుల నిర్లక్ష్యమోగానీ ఇరుకుగా ఉన్న అద్దె భవనంలో మండల కేంద్రంలోని గ్రంథాలయం కొనసాగుతోంది. దీంతో పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. ఒకేసారి చాలా మంది వస్తే ఆరుబయట నిలబడి చదవాల్సిన పరిస్థితి. అలాగే దినపత్రికలు కూడా ఒకటి రెండు మాత్రమే వస్తున్నాయని వాటిని మాత్రమే చదవాల్సి వస్తుందని పాఠకులు వాపోతున్నారు. గ్రంథాలయంలో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయని మండిపడుతున్నారు.

రెండు, మూడు దినపత్రికలే..

గతంలో గ్రామ పంచాయతీ భవనంలోనే గ్రంథాలయం కొనసాగినప్పుడు కొన్ని పుస్తకాలైనా ఉండేది. కానీ అద్దెభవనంలోకి వచ్చినప్పటి నుంచి గ్రంథాలయంలో దినపత్రికలు రెండు, మూడు మాత్రమే ఉంటున్నాయని వార పత్రికలు, మాస పత్రికలు నవలలు కాని లేవని పాఠకులు తెలుపుతున్నారు. యువతి, యువకులు పోటీ పరీక్షలకు కావాల్సినా సమాచారంతో పాటు విద్యా, ఉద్యోగ సమాచారం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రంథాలయాలకు ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయించకుండా చిన్నచూపు చేస్తున్నాయని పాఠకులు ఆరోపిస్తున్నారు. గ్రామీణ మండల కేంద్రాల్లో ఉన్న గ్రంథాలయాల్లో సరైన పుస్తకాలు ఉండకపోగా అభివృద్ధికి నోచుకోవడం లేదని విమర్శిస్తున్నారు. అధికారులు చొరవ చూపి గ్రంథాలయానికి పక్కాభవనం నిర్మించడంతో పాటు కావాల్సినా సమాచారం లభించే విధంగా పుస్తకాలు నవలలు ఉండే విధంగా కృషి చేయాలని మండలంలోని పాఠకులు కోరుతున్నారు.



అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం

భవనం నిర్మించాలి



మండల కేంద్రంలోని గ్రంథాలయంలో కేవలం వార్త పత్రికలు ఒకటి రెండు మాత్రమే ఉంటున్నాయి. నవలలు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో లేవు. పాఠకులకు అనువుగా ఉంటే విధంగా పక్కా భవనం నిర్మించాలి.

– మహేందర్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

టేకుకలప స్వాధీనం



టేకు కలపను అటవీశాఖ కార్యాలయానికి తరలిస్తున్న అధికారులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని తిప్పాపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఆలుబాక సెక్షన్ అధికారి చంద్రమోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిప్పాపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా బులోరో వాహనంలో టేకు కలపను తరలిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అటవీశాఖ తిప్పాపురం గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలోకి చేరుకునే సమయానికి అటవీశాఖ అధికారులను గమనించిన స్మగ్లర్లు వాహనాన్ని, పది టేకు దిమ్మలను అక్కడే వదిలి పెట్టి వదిలి అటవీలోకి పారిపోయారని తెలిపారు. టేకు కలపను బోలోరో వాహనాన్ని వెంకటాపురం అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న టేకు కలప విలువ రూ.రెండు లక్షల యాభై రెండు వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో అటవీశాఖ సిబ్బంది మౌనిక, బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు.

గుడుంబా స్వాధీనం.. నలుగురి అరెస్టు

వాజేడు: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి గుడుంబాను తీసుకువస్తున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం టేకులగూడెం వద్ద ఆదివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి రెండు ద్విచక్ర వాహనాలపై ప్లాస్టిక్ కవర్లలో 160 లీటర్ల గుడుంబా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. దీంతో వారిని అదుపులోకి తీసుకోవడంతో పాటు సారాను, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు చిన్న గొల్లగూడెం గ్రామానికి చెందిన తాడూరి రవీందర్, ధర్మవరం గ్రామానికి చెందిన దాగం మధుసూదన్‌రావు, పేరూరుకు చెందిన తల్లడి ప్రశాంత్, పూసూరుకు చెందిన కురుసం నరేష్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెల్కిపారు. గుడుంబా విలువ సుమారు రూ.64 వేలు ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు. హెడ్ కానిస్టేబుల్ సాంబశివరావు, కానిస్టేబుళ్లు నరేష్, మహేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నవీన్ పాల్గొన్నారు.



నిందితులను చూపుతున్న ఎస్సై కృష్ణప్రసాద్

రుణమాఫీలో అర్హులైన రైతులకు అన్యాయం

మంగపేట: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ పథకాన్ని అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పల్నాటి సతీష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమాశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తానని చెప్పి మూడు విడతలుగా ప్రకటించినా కూడా రైతులకు న్యాయం జరుగలేదన్నారు. అర్హులైన వేలాది మంది రైతులు ఆందోళనలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాడెం రవీందర్, నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, ప్రశాంత్, దిడ్డి రమేష్, సాంబయ్య, జానకీ రామ్, శ్రీను, నరేందర్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సతీష్

రోడ్లపైకి పశువులను వదలొద్దు

కాటారం: పశువుల యజమానులు రోడ్లపైకి పశువులను వదలొద్దని పంచాయతీ కార్యదర్శి షగీర్ ఖాన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రోడ్లపై తిరుగున్న పశువులను పంచాయతీ సిబ్బంది స్థానిక గ్రామ పంచాయితీ ఆవరణలోని బంజరుదొడ్డికి తరలించారు. ఈ సందర్భంగా షగీర్‌ఖాన్ మాట్లాడుతూ.. పశువులు రోడ్లపై సంచరిస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు రాత్రి పూట వాహనదారులు గమనించక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. మొదటి హెచ్చరికలో భాగంగా పశువులను బంజరుదొడ్డికి తరలించామని యజమానులు వచ్చి తమ పశువులను తీసుకెళ్లకపోతే గోశాలకు తరలిస్తామని పేర్కొన్నారు.



బంజరుదొడ్డిలోకి తరలించిన పశువులు